క్లుప్తంగా

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

కడప వైఎస్ఆర్ సర్కిల్: చంద్ర రాజేశ్వరరావు అవిశ్రాంత పోరాట యోధుడని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర రావు బలమైన కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాణం కోసం గట్టి పునాదులు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్రమణ్యం, ఎంవీ సుబ్బారెడ్డి, వేణుగోపాల్, కేసీ బాదుల్లా, కొమ్మద్ది ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేశాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న 3.15 లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో అతి పెద్ద రవాణా సంస్థ అయిన రైల్వేశాఖలో కేంద్ర ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. వందే భారత్ రైలు ప్రారంభోత్సవం చేస్తున్న మోదీ ప్రచార ఆర్భాటాలు చేయడం తప్ప చేసింది శూన్యమని విమర్శించారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన మోదీ ఒక్క ఉద్యోగం కూడ భర్తీ చేయలేదని విమర్శించారు. డీవైఎఫ్ఐ నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సభను జయప్రదం చేయండి

కడప సెవెన్‌రోడ్స్: మదనపల్లెలో ఈనెల 19న జరిగే బహుజన రాజ్యాధికార సభను జయప్రదం చేయాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి సగిలి గుర్రప్ప, నాయకులు కానుగదానం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆ పార్టీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె సభకు బీఎస్పీ జాతీయ కో ఆర్డినేటర్ ఆకాశ ఆనంద్, 17 రాష్ట్రాల ఇన్‌ఛార్జులు, రాజ్యసభ సభ్యులు రామ్‌జీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, రాష్ట్ర కో ఆర్డినేటర్ బాలయ్య తదితరులు హాజరవుతారన్నారు. జిల్లానుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య, కోశాధికారి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులందరికీ ఓపీఎస్ అమలు చేయాలని, ఓపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఉద్యోగులు దేన్నీ ఒప్పుకోరు అని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వెంకట జనార్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండారెడ్డి, ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, ప్రజా సంక్షేమ ప్రభుత్వానికి రెండు కళ్లు అని, ప్రజా సంక్షేమ కోసం ఉద్యోగుల హక్కులను హరించకూడదని పేర్కొన్నారు. వారికి అందవలసిన వేతన భత్యాలు సకాలంలో అందచేయాలని తద్వారా ఉద్యోగులు స్వేచ్ఛగా పనిచేసుకునే వెసులుబాటు కలిగించాలన్నారు. ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్దరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన క్రిష్టఫర్ జార్జి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక అమ్మ ఒడి బాలల ఆశ్రమంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు రవి, సరోజ తొలుత ప్రార్థనలు నిర్వహించి పిల్లలందరినీ ఆశీర్వదించారు. వారికి దైవం మంచి జీవితాన్ని ప్రసాదించాలని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగులు ఓరకంటి రమేష్, వెంకట శేఖర్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఘనంగా కలశాల ఊరేగింపు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డు సమీపంలోని వాసవీ కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ రాజగోపుర ప్రతిష్ట, మహా కుంభాభిషేక పూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి రోజు మంగళవారం కలశాలను స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వాసవీ కాలనీలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆలయంలో సాయంత్రం స్వస్తివాచనం, అంకురార్పణతో యాగశాల నిర్వహించి చతుర్వేది పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేయండి

ఎర్రగుంట్ల : స్వయం సహాయక పొదుపు సంఘాల బలోపేతంకు కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏ రివ్యూ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సంఘాలకు వస్తున్న సంక్షేమ పథకాలన్నింటిని సభ్యులకు అందించాలన్నారు. సంఘాల గ్రేడింగ్, జగనన్నతోడు, హౌసింగ్ బిల్లు, స్త్రీనిధి ఇతర అంశాలపై వారితో చర్చించారు. జిల్లాస్థాయిలో మండలాన్ని ఉన్నతస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో ఏసీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఓ జగదీశ్వరీ, నాగేంద్ర, సీసీలు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



చౌటపల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మాచునూరు గ్రామ సచివాలయం పరిధిలోని చౌటపల్లె, చౌటపల్లె దళితవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాడన్నారు. అర్హుత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఉంటే తమ దృష్టికి తీసుక వస్తే అక్కడే అధికారులతో మాట్లాడి పథకాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయాలేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు రైతు భరోసా, పక్కాగృహాలు, ఇంటి స్థలం లేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకుని సత్వరం వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చౌటపల్లె దళితవాడలో సీసీరోడ్డులు వేయించాలని అడిగారు వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చక్కటి సౌకర్యాలు కల్పించాలి

- వైవీయూ వీసీ ఆచార్య సుధాకర్



ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వీసీ సుధాకర్, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల తెరిచే నాటికి వసతిగృహాలు అన్ని సిద్ధం చేయాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వైవీయూలోని వసతిగృహాలను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిలతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వీసీ మాట్లాడుతూ అవసరమైన చోట మరమ్మతులను చేపట్టాలని, మరీ ముఖ్యంగా అన్ని గదుల్లో వెలుతురు ఉండేలా లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 19 నాటికి విద్యార్థులు రానున్న నేపథ్యంలో ఏ చిన్న అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేసి సౌకర్యవంతంగా వసతిగృహాలను తీర్చిదిద్దాలని ఆదేశాలు ఇచ్చారు. పరిశోధక విద్యార్థులతో ఆయన మాట్లాడి వారి పరిశోధన, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసిస్టెంట్ డాక్టర్ రెడ్డయ్య, ఇంజినీరింగ్ అధికారులు రాజశేఖరరెడ్డి, సోమశేఖరరెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష..

విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బందితో వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య సమీక్ష నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి ప్రగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

దేవునికడపలో రహదారుల నిర్మాణానికి చర్యలు



రోడ్డు కొలతలు వేయిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: దేవునికడప ఆలయం సమీపంలో పలు రోడ్లు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 1వ డివిజన్‌లోని పాతకడప, దేవునికడప ప్రాంతాల్లో పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించారు. పద్మావతి కళ్యాణ మండపం సమీపంలో రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేస్తూ శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు గడువు పెంపు

ప్రొద్దుటూరు : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువును పొడిగించినట్లు ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీసీహెచ్ జగదీశ్వరుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం గత నెల 29 నుంచి ఈనెల 5వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం గడువు పొడిగించిందని, యథావిధిగా రోజూ కౌన్సిలింగ్‌కు హాజరు కావచ్చునని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కౌన్సిలింగ్‌కు విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీ పేమెంట్ రిసిప్ట్, హాల్ టికెట్ ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ సర్టిఫికేట్, 6–10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్ లేదా రెసిడెన్సి సర్టిఫికేట్, కొత్తగా జారీ చేయబడిన ఈడబ్ల్యూఎస్ సర్టిపికెట్లు తీసుకురావాలన్నారు. 2020 జనవరి 1 తర్వాత తీసుకున్న ఇన్‌కం సర్టిఫికెట్, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, టీసీ ఒరిజనల్‌తోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు.

వైఎస్సార్ సీపీతోనే బీసీలకు గౌరవం



మాట్లాడుతున్న బీసీ ప్రజాప్రతినిధులు

ప్రొద్దుటూరు : టీడీపీ హయాంలో బీసీలకు ఎలాంటి మేలు జరగలేదని.. వైఎస్సార్‌సీపీతోనే వారికి ఎనలేని గౌరవం దక్కిందని బీసీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. వ్యక్తిగత సమస్యల కారణంగా హత్యకు గురైన నందం సుబ్బయ్య నారా లోకేష్‌కు దేశ నాయకుడిలా కనిపిస్తున్నాడా అని ప్రశ్నించారు. నందం సుబ్బయ్య కనీసం వార్డు మెంబర్ కూడా కాదన్న విషయాన్ని తెలుసుకోవాలని పేర్కొన్నారు. స్థానిక భావనారుషి ఆలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. బీసీలంటే నారా లోకేష్ చిన్న చూపు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్ద పీట వేసి చైర్‌పర్సన్లు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచ్ పదవులును కేటాయించగా, టీడీపీ తమకు ఉన్న 33వ వార్డు కౌన్సిలర్ గాజుల శివజ్యోతిని కూడా సస్పెండ్ చేసిందన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బీసీలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ బీసీ నేతల ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదన్నారు. గతంలో ఎంతో మంది బీసీ నాయకులను టీడీపీ పొట్టన పెట్టుకుందని తెలిపారు. చేనేత కార్మికులు నివసిస్తున్న వార్డుల్లో పాదయాత్ర నిర్వహించిన లోకేష్ కనీసం ఒక్క చేనేత కుటుంబాన్ని అయినా పరామర్శించారా అని ప్రశ్నించారు. చర్చిలకు వెళ్లకుండా క్రైస్తవులను అవమానించారన్నారు. 35వ వార్డు కౌన్సిపల్ పిట్టా బాలాజీ, మాజీ సర్పంచ్ రమణయ్య యాదవ్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని మరోసారి గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు రావులకొల్లు అరుణ, చింపిరి అనిల్‌కుమార్, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు చౌడం రవిచంద్ర, ఉప్పర మురళీ, తుపాకుల వెంకటరమణ, బండారు లక్ష్మీదేవి సూర్యనారాయణ, రాగా నాగలక్ష్మి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి తిరుప్పావడ సేవ



స్వామి వారికి తిరుప్పావడ సేవ నిర్వహించిన వేదపండితులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతపురం పంచాయతీ లక్ష్మిపాలెం గ్రామంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో శ్రీవారి విమాన గోపురం, రాజగోపురం నూతనంగా నిర్మించిన సందర్భంగా నిర్వహిస్తున్న కుంభాభిషేక మహోత్సవాలల్లో భాగంగా మంగళవారం ఉదయం తిరుప్పావడ సేవ, పంచగవ్యము, గోపురశుద్ధి, శయ్యాదివాసము, కలశ శుద్ధి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, దేవాదాయశాఖ కార్య నిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు నాగమణి, చంద్రయ్య, పెద్దవీరయ్య, రమణమ్మ, లక్షుమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్న గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

డయేరియా వ్యాధి నివారణకు కృషి చేయాలి

వీరపునాయునిపల్లె : డయేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మండల నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి కోరారు. మంగళవారం మండలంలో ఎస్.పాలగిరి సచివాలయ పరిధిలోని నేలతిమ్మాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో డయేరియా పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి 5 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వారికి డయేరియా సోకకుండా ఉండేందుకు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్‌లను అందించాలన్నారు. అనంతరం డయేరియా నివారణ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం రమాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ సంయుక్త, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, ఆశా కార్యకర్త చంద్రకళ, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాల సేకరణపై అవగాహన సదస్సు

వీరపునాయునిపల్లె : స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం భాగ్యమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పాల సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రాజెక్టు అధికారి ఆనంద్‌నాయక్ హాజరై మాట్లాడారు. మండలంలోని యు.రాజుపాలెం, తంగెడుపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె, అనిమెల గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని ప్రారంభించామని పాల సేకరణ శాతం చాలా తక్కువగా ఉందని వీఓఎలు పాడి రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ఇదివరకు స్త్రీనిధి ద్వారా రుణాలు పొందిన వారి నుంచి రీకవరి చేయించాలని ఏపీఎం భాగ్యమ్మ సూచించారు. కమలాపురం ఏరియా కో ఆర్డినేటర్ రఘునాథరెడ్డి, సీసీలు, వీఓఎలు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కమలాపురం : మండల పరిధిలోని చిన్నచెప్పలికి చెందిన చెప్పలి మల్లమ్మ (77) అనాథ మృతదేహానికి మంగళవారం అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు అంత్యక్రియలు నిర్వహించారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మల్లమ్మ సోమవారం రాత్రి మృతి చెందిన విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ట్రస్ట్ సభ్యుల సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయండి

– జిల్లా పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాసులు

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పట్టు పరిశ్రమపై పట్టు సాధించాలని జిల్లా పట్టుపరిశ్రమ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక పట్టుపరిశ్రమ కార్యాలయంలో పట్టుపరిశ్రమ మండలాల ఇన్‌చార్జిలకు ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలో గత ఏడాదిలో 20,060 ఎకరాలలో పట్టు సాగులో ఉండేదని.. ప్రస్తుతం అదనంగా 160 ఎకరాలలో సాగు చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మంచి దిగుబడి ఇచ్చే పట్టు పంటపై గ్రామీణ ప్రాంతాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. సిరికల్చర్‌లో ఐదులేక ఆరు పంటలను సాగు చేస్తే రైతులకు మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఒక పంటకు ఒక లక్ష ఆదాయం వస్తుందని.. ప్రస్తుత కాలంలో చాలా మంది రైతులు సెరికల్చర్ సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. వనిపెంట, ఊటుకూరు ప్రాంతాల నుంచి ఒక మొక్క రూ.2లతో ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఒక ఎకరాకు యూనిట్ ధర రూ.25 వేలు ఉంటే ..అందులో రూ.18,750ల సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అయితే 22,500ల సబ్సిడీ వర్తిస్తుందన్నారు. షెడ్డులు నిర్మించుకుంటే యూనిట్ ధర రూ.4 లక్షలు ఉంటే.. రూ.3 లక్షలు సబ్సిడీ వస్తుందన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు అయితే రూ.3.60 లక్షల సబ్సిడీ వస్తుందన్నారు. పులివెందుల ప్రాంతంలో 160 ఎకరాలలో పట్టు సాగు చేయాలని లక్ష్యంతో మండలాల ఇన్‌చార్జిలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అగ్రికల్చర్‌లో పంట సాగు చేసిన రైతులకు ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తోందని వివరించారు.

దరఖాస్తుల స్వీకరణ

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన మొదటి విడత 14 గ్రామాలకు అదనపు పరిహారం కోసం దరఖాస్తులు రెవెన్యూ సిబ్బందితో తీసుకుంటున్నట్లు మండల తహసీల్దార్ శోభనబాబు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఐదు ప్రత్యేక కౌంటర్ల ద్వారా నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మొదటి విడత గ్రామాల్లోని నిర్వాసితులు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను అందజేయాలని వివరించారు.

లోకేష్‌ది యువగళం కాదు అసత్య గళం

- ఆయన చేసేది బోగస్ పాదయాత్ర
- కమలాపురం అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- సీకే దిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీకే దిన్నె జెడ్పీటీసీ సభ్యుడు నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబు చేస్తున్నది యువగళం కాదని అదో అసత్య గళమని సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్ర వల్ల అద్భుతమైన మేనిఫెస్టో వచ్చి ప్రజల కష్టాలు తీరాయన్నారు. 2012లో చంద్రబాబు సాయంత్రం పూట పాదయాత్ర చేశారని, అది ఆయనకు మాత్రమే ఉపయోగపడింది తప్పా ప్రజలకు ఉపయోగపడలేదన్నారు. 2019కి ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టి అధికారంలోకి వచ్చాక నవరత్న పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కళ్లకు కట్టినట్లు అగుపిస్తున్నాయన్నారు. కొండపేట బ్రిడ్జి నుంచి లోకేష్ పాదయాత్ర మొదలైందని, ఆ బ్రిడ్జిని దివంగత వైఎస్సార్ రూ.18కోట్లతో నిర్మించారని గుర్తు చేశారు. పక్కనే ఉన్న బలిసింగాయపల్లెలో షుగర్ ఫ్యాక్టరీని వైఎస్సార్ ప్రారంభించారన్నారు. అది మళ్లీ మూతపడితే అందులో పనిచేస్తున్న 500 మంది కార్మికులకు రూ.13కోట్ల బకాయిలు ఇప్పించిన ఘనత కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కమలాపురంను నగర పంచాయితీగా మార్చి రోడ్లు, డ్రైనేజీ, రింగురోడ్డు, అగ్రికల్చర్ ల్యాబ్ మంజూరు చేయించారన్నారు. టీడీపీ నాయకుడు కబ్జా చేసిన భూములు పేదలకు పంచారన్నారు. లోకేష్ పాదయాత్రను జనం పట్టించుకోలేదని, అందుకే ఆయన సీఎం జగన్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు మట్టికోసం తాము భూములను కొన్నామని, అందులో చేపల చెరువులు ఏర్పాటు చేసుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ పేరెత్తే అర్హత కూడా లోకేష్‌కు లేదని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, క్రిష్ణయ్య, సుబ్బరాయుడు, బాలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదు

కమలాపురం శాసన సభ్యులు పి.రవీంద్రనాథ్ రెడ్డిని విమర్శించే అర్హత లోకేష్‌కు లేదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రవీంద్రనాథ్‌రెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా, కడప తొలి మేయర్‌గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు ఎనలేని సేవలు చేస్తున్నారన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని దొడ్డిదారిన ఎమ్మెల్సీ పదవి పొంది మంత్రి అయిన లోకేష్‌కు రవీంద్రనాథ్‌రెడ్డిని విమర్శించే నైతిక అర్హత లేదన్నారు.

పాడి పరిశ్రమతో ఆర్థిక స్వావలంబన

- కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: నేటి పోటీ ప్రపంచంలో రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే ఆర్థిక స్వావలంబనను సాధించవచ్చని కృషి విజ్ఞానకేంద్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. మంగళవారం కడప ఊటుకూరు కేవీకేలో గ్రామీణ యువతకు శాస్త్రీయ పాడిపరిశ్రమ యాజమాన్య పద్ధతులపై ఆర్య పథకంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాడి– పంట ప్రాముఖ్యత గురించి వివరించారు. సకాలంలో పశువులను గర్భం, చూడి దాల్చితే కలిగే లాభాల గురించి వివరించారు. ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ మురళీకృష్ణ , పశు విజ్ఞా శాస్త్రవేత్త లావణ్య పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్య పథకంలో రైతులకు చాప్ కట్టర్లు, ఖనిజ లవణ మిశ్రమం, గడ్డి విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, మహేష్, స్వామి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

రాహు, కేతువు నుంచి కాపాడు తల్లీ!



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్: స్థానిక విజయదుర్గాలయంలోని అమ్మవారి సన్నిధిలో రాహుకాల పూజల కోసం మంగళవారం మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భక్తుల సంఖ్య ఊహించని విధంగా పెరగడంతో ఆ ప్రాంగణంలో చోటు చాలలేదు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నిబంధనల మేరకే మట్టి తవ్వకాలు

వల్లూరు: నిబంధనల మేరకే చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి తప్ప ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదని, టీడీపీ నేతలు నిజాలు తెలుసు కోకుండా వైఎస్ఆర్‌సీపీ నేతలు నిబంధనలు అతిక్రమించి లోతుగా మట్టి తవ్వకాలను జరుపుతున్నారని అసత్య ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని వైఎస్ఆర్‌సీపీ నేతలు విమర్శించారు. కడపలోని జిల్లా వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి శివకుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి భూసిపాటి కిషోర్ కుమార్, పార్టీ నేతలు విశ్వనాథరెడ్డి, బాల మైసూరారెడ్డి, పుల్లయ్యలు మాట్లాడారు. ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డిని టీడీపీ నేత నారా లోకేష్ విమర్శించడం హాస్యాస్పదంగా వుందన్నారు. వల్లూరు మండలంలోని మూడు పంచాయతీల నుంచి టీడీపీలో చేరింది సుమారు 20 కుటుంబాలేనని, దాని వలన వైఎస్ఆర్‌సీపీకి ఎలాంటి నష్టం లేదన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

చెన్నూరు : నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా చెన్నూరులో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని విమర్శించడం తగదని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎల్లమ్మ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏదైతే పేపర్లలో రాసి ఇచ్చారో దానిని లోకేష్ చిన్నపిల్లాడిలా చదవడం తప్ప, అందులో నిజానిజాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదన్నారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, తానుగాని ఎక్కడ కూడా ఒక సెంటు భూమి అక్రమంగా తీసుకోలేదన్నారు. టీడీపీకి చెందిన డాక్టర్ కృష్ణకిషోర్‌రెడ్డి వద్ద కొనుగోలు చేశామన్నారు. ఏదైనా జరిగిఉంటే కృష్ణకిషోర్‌రెడ్డి మాట్లాడేవారన్నారు. ఎప్పుడైతే కలెక్టర్ ఆ భూమికి సంబంధించి రెగ్యులరైజేషన్ చేశారో అప్పుడు కొనుగోలు చేశామన్నారు.

కూలిన చెట్లు.. తొలగించక పాట్లు



వైవీయూ: ఇటీవల వీచిన గాలివానకు కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో 10కిపైగా చెట్లు నేలకూలాయి. పచ్చని చెట్లు, ఎండిన చెట్లు అన్న భేదం లేకుండా కళాశాల ఆవరణం, మైదాన సమీప ప్రాంతాల్లో చెట్లు కూకటివేళ్లతో సహా నేలకూలాయి. ఇది జరిగిన దాదాపు 10రోజులు పైగా అవుతున్నా కళాశాల అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఓ వృక్షం కూలి కెమిస్ట్రీ విభాగానికి వెళ్లే దారిని మొత్తం కప్పేసేయడంతో లోపలికి వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది. అధికారులు స్పందించి వెంటనే కూలిన చెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



